ఆస్పత్రిలో దాహం కేకలు!

- టెక్కలి జిల్లా ఆస్పత్రిలో రోగుల అవస్థలు
- బయట నుంచి నీటిని తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్న వైనం
- మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంట్

టెక్కలి రూరల్: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలిలోని జిల్లా ఆస్పత్రిలో మంచినీరు లేక రోగులు తల్లడిల్లుతున్నారు. గొంతు తడుతుకోవడానికి రోగులు, వారి సహాయకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలోని ఆర్వో ప్లాంట్ కొద్దిరోజులుగా మరమ్మతులకు గురైంది. తక్షణమే బాగు చేయించుకుండా కాలయాపన చేస్తుండడంతో రోగులకు నీరు లభ్యం కాని పరిస్థితి తలెత్తింది. ఆర్వో ప్లాంట్‌తో పాటు వాటర్ ఫిల్టర్ సైతం మరమ్మతులకు గురైనప్పటికీ వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఆస్పత్రి కింద ఫ్లోర్‌లో వాటర్ క్యాన్‌తో ఒకసారి మాత్రమే నీరు పెడుతున్నారు. ఇవి కొద్ది సేపట్లోనే అయిపోతున్నాయి. ఆ తరువాత మళ్లీ పెట్టడం లేదని రోగులు వాపోతున్నారు. నీటి కోసం రోగులు, వారికి సహాయకులుగా వస్తున్నవారు ఖాళీ బాటిళ్లతో ఆస్పత్రి మొత్తం తిరుగుతున్నా ఎక్కడా నీరు లభ్యం కావడం లేదు. దీంతో కొంతమంది బయట ఉన్న దుకాణాలు, హోటళ్ల వద్దకు బాటిళ్లతో నీటిని తెచ్చుకుంటుండగా.. ఆర్థిక స్థోమత ఉన్నవారు వాటర్ బాటిళ్లను కొనుక్కొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ ఆస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీటి అవసరాలు పెరిగాయి. అయితే ఇక్కడ నీరు లభ్యం కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.


మరమ్మతులకు నోచుకోని ఆర్వోప్లాంట్


పాడైన వాటర్ ఫిల్టర్


నీటి కోసం బాటిళ్లతో తిరుగుతున్న రోగి బంధువులు


క్యాన్‌లో ఉన్న కొద్దిపాటి నీటిని పట్టుకుంటున్న మహిళ

సమస్య వాస్తవమే..

ఆస్పత్రిలో మంచినీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. ఆర్వోప్లాంట్ మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం. రోగుల కోసం క్యాన్లతో మంచినీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఆస్పత్రిలో నీటి సమస్య లేకుండా తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– బి.సూర్యారావు, టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరిండెంటెంట్

బాహుదా నదికి నీటిని విడుదల చేయండి

- చీకటి ఎమ్మెల్యేకు ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి

ఇచ్ఛాపురం: బాహుదా నదికి నీటిని విడుదల చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చీకటి నియోజకవర్గ ఎమ్మెల్యే మనోరంజన్‌ద్యాన్ సమంతరకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేను మున్సిపల్ కమిషనర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ ప్రజలకు అవసరమైన మంచినీటిని సరఫరా చేసేందుకు స్థానిక బాహుదా నదిలో నీరు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. బాహుదా నదికి ఎగువన ఒడిశాలోని బగలట్టి వద్ద ఉన్న డ్యామ్ నుంచి ప్రజల అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ డ్యామ్‌లో నీటి మట్టం పెరిగితే నీటిని విడుదల చేస్తామని హామీచ్చినట్లు కమిషనర్ తెలిపారు.


ఎమ్మెల్యే మనోరంజ్‌ధ్యాన్ సమంతరతో కమిషనర్ రమేష్

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటల నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

సారాతో ఇద్దరు అరెస్టు

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సోంపేట, కంచిలి మండలాల్లో మంగళవారం దాడులు నిర్వహించి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ కె.బేబి తెలిపారు. సోంపేట మండలం బాతుపురంలో ఐదు లీటర్ల సారాతో సాహుకారి బోగేశ్వరిని, కంచిలి మండలం ఎస్.ఆర్.సి.పురంలో పది లీటర్ల సారాతో పిట్ట పార్వతిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో పెట్రోలింగ్ పార్టీ సీఐ జి.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

కాశీబుగ్గ: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఎస్ఎంయూ చైర్మన్ డి.సి.హెచ్.రావు, సెక్రటరీ ఎ.వి.రావు, కోశాధికారి డి.ఎస్.రావు, గ్యారేజీ సెక్రటరీ డి.ఎల్.నారాయణ, నాయకులు బి.పి.రావు, ఎస్.ధనుంజయ, ఎం.పి.రావు, వి.ఎస్.రావు, జె.ఎస్.కుమార్, ఎల్.ఎల్.చారి, వి.ఇంద్ర పాల్గొన్నారు.


నిరసనలో ఎస్ఎంయూఏ నాయకులు

అటవీశాఖ పనులపై విజిలెన్స్ విచారణ

కాశీబుగ్గ: అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ విభాగం శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు ఎస్పీ బర్ల ప్రసాదరావు పర్యవేక్షణలో కాశీబుగ్గ రేంజ్, మందస సెక్షన్‌కు సంబంధించి అటవీశాఖ చేపట్టిన మొక్కల పెంపకం, ట్రెంచ్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు జరిగాయా..లేదా అనే అంశంపై చేసిన పరిశీలన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ వై.గోవిందరావు, డీఈ సత్యనారాయణ, అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్ కుమార్, ఏఈ గణేష్, కాశీబుగ్గ అటవీ రేంజ్ అధికారులు ఉన్నారు.


నాటిన మొక్కలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఘనంగా అసిరిపోలమ్మ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామ దేవత అసిరిపోలమ్మ వార్షికోత్సవ మహోత్సవాన్ని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. కవిటి కాళీమాత వేషధారణ, డొంకూరు సన్నాయి మేళంతో సంబరం అంబరాన్ని తాకింది.


అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

నేడు మాకన్నపల్లిలో శ్రీశ్రీ జయంతి

పలాస: మాకన్నపల్లి గ్రామంలో బుధవారం మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఉద్దానం రచయితల సంఘం అధ్యక్షులు కుత్తుం వినోద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కవి సమ్మేళంతో పాటు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కందుకూరి పురస్కారం పొందిన డాక్టర్ కుమార్‌నాయక్‌ను సత్కరిస్తామన్నారు.

ఖోఖో పోటీలకు పయనం


రెయ్యి సరస్వతి

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కాదాలక్ష్మి కాంతమ్మ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు ఈ నెల 30 నుంచి మే నెల నాలుగో తేదీ వరకూ ఢిల్లీలో జరగనున్నాయి. దీంతో కాంతమ్మ పోటీల్లో పాల్గొనేందుకు పయనమై వెళ్లినట్టు పాఠశాల హెచ్.ఎం.రవణమ్మ మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి నెలలో చిత్తూరులో జరిగిన అండర్–19 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు.

బాగున్న వాటికి మరమ్మతులు తగదు

కాశీబుగ్గ: బాగున్నవాటికి మరమ్మతులు తగదని వంశధార జలసాధన కమిటీ సభ్యులు అన్నారు. సంకుజోడు సప్లై ఛానల్ లెవల్ పూనును మరమ్మతులు చేయడాన్ని ఖండిస్తున్నామని కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పహల్గాం మృతులకు నివాళులు


సంతబొమ్మాళి: కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు


కవిటి: ఎర్రగోవిందపుట్టుగలో నివాళులర్పిస్తున్న చిన్నారులు, పాఠశాల సిబ్బంది


ఇచ్ఛాపురం: ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తున్న మాజీసైనిక ఉద్యోగులసంఘ సభ్యులు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని చిన్నారులు, మాజీ సైనిక ఉద్యోగులు నినదించారు. దాడిని ఖండించారు. ఉగ్రవాదాన్ని అరికట్టాలని కోరారు. కాల్పులను ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు.

–సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు: పీఎంపురంలో పహల్గామ్ మృతులకు కొవ్వొత్తులలో నివాళులర్పిస్తున్న సైనికులు, మాజీ సైనిక ఉద్యోగులు, చిన్నారులు

క్లుప్తంగా

అమ్మవారికి ఎమ్మెల్సీ పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి స్థానిక చింతామణి కాలనీ వాసులు మంగళవారం ఘనంగా సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు సత్కరించారు.

సింధుపురాణి అమ్మవారి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్


అమ్మవారి గజముద్దను మోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కవిటి: బల్లిపుట్టుగ గ్రామదేవత సింధుపురాణి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకునే పూజల్లో భాగంగా ఆమె అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను తలపైకి ఎత్తుకుని ఊరేగింపుయాత్రలో పాల్గొన్నారు. అంతకుముందు ఆమె కవిటి చింతామణి కాలనీ వాసులచే నిర్వహించిన గ్రామ దేవత సంబరంలో పాల్గొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

కంచిలి: కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండల కేంద్రం కంచిలిలో మెయిన్‌రోడ్డు నుంచి జి.జె.కళాశాల వరకు నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ప్రారంభించారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు మంజూరైన ట్రైసైకిళ్లను జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. జాడుపూడిలోని కేజీబీవీలో అదనపు భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత


జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వసంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

టెక్కలి: సంతబొమ్మాళి మండల జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడు వివాహ ఆహ్వాన పత్రికను జగన్మోహన్‌రెడ్డికి అందజేశారు.

డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని వినతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి ఎనిమిదో వార్డు పెసరపాడు కాలనీలో డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఈ ప్రాంతానికి పారిశుద్ధ్యం పరిశీలనకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావును కలిసి విన్నవించారు.

తీర ప్రాంత అభివృద్ధికి చర్యలు

సోంపేట: బారువ తీరప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పర్యాటక శాఖాధికారి నారాయణరావు అన్నారు. తీర ప్రాంతాన్ని మంగళవారం స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తీరంలో శాశ్వత గుడిసెలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

లారీ బీభత్సం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామ సమీపంలో మంగళవారం శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వస్తున్న లారీ బీభత్సం సృష్టించింది. శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు సిమ్మెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా రావడంతో లారీ డ్రైవర్ తన లారీని అదుపు చెయ్యలేక పెద్దబమ్మిడి గ్రామ సమీపంలో ముందు ఉన్న ఆటోను ఢీకొట్టి కొంత దూరంలో పార్కుచేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని, ఆ తర్వాత సమీపంలో చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆటోలో ఉన్న ఎస్.బాలకృష్ణ, ఎం.తాతారావులకు గాయాలు కావడంతో కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి పోలీసులు వివరాలు సేకరించారు.

చిన్నారులకు పాటల పోటీలు



భగవాన్ సత్యసాయిబాబా తల్లి ఈశ్వరాంబ వారోత్సవాల్లో భాగంగా బాల వికాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలిలోని రోటరీనగర్ శాంతి సుధామందిరంలో చిన్నారులకు భక్తి పాటల పోటీలను మంగళవారం నిర్వహించారు. నిర్వాహకులు బి.అన్నపూర్ణమ్మ, కె.వెంకటలక్ష్మి, భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల పోటీల్లో భాగంగా సీనియర్స్ విభాగంలో జి.సాయిచరణ్, ఎల్.మోక్షిత, నైమిష, జ్ఞానేశ్వర్, జూనియర్స్ విభాగంలో సుహాస్ నారాయణ, పృథ్వీ, యశ్వంత్, సోహాన్ విజేతలుగా నిలిచారు.

–టెక్కలి

వైభవంగా జలయాత్ర



కవిటి మండలం చిన్నకర్రివానిపాలెంలోని కాశీవిశ్వనాథ స్వామి ఆలయం సింహద్వార ప్రతిష్టలో భాగంగా మంగళవారం సాయంత్రం జలయాత్రను వైభవంగా నిర్వహించారు. పవిత్ర నదీజలాలను సముద్ర జలాలతో కలిసి యాగశాల సంప్రోక్షణతో ఐదు రోజులు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మహారుద్రయాగం, తారకనామమంత్ర పారాయణ, అన్నప్రసాద యజ్ఞం నిర్వహించనున్నారు.

–కవిటి

ఉత్సవ నిర్వహణపై సమీక్ష



మండల కేంద్రం కంచిలి గ్రామదేవత కంచమ్మతల్లి ఉత్సవాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాటుపై మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జూన్ ఒకటో తేదీ రాత్రి నుంచి పదవ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో మంచినీరు, కరెంటు సరఫరా, శానిటేషన్ తదితర సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ శాఖవారు అదనంగా బస్సు సర్వీసులు నడపాలన్నారు. సారా అమ్మకాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ శాఖ సిబ్బందికి సూచించారు. జనసేన పార్టీ నాయకుడు దాసరి రాజు, ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, సోంపేట సీఐ బి. మంగరాజు, స్థానిక ఎస్సై పి.పారినాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.మోహనరావు ఉన్నారు.

–కంచిలి

మాజీ సీఎం జగన్‌ను కలిసిన తిలక్



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి టెక్కలి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు.

–టెక్కలి

డీఎస్సీ గ్రాండ్ మోడల్ టెస్ట్ రేపు

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్రలో మే ఒకటో తేదీన రాష్ట్ర స్థాయి డీఎస్సీ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు షైనింగ్ స్టార్ యువజన సంఘం అధ్యక్షులు వై.సంతోష్‌కుమార్ మంగళవారం తెలిపారు. యువజన సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా పరీక్ష నిర్వహణ, క్విజ్ ఫోరమ్ ఆధ్వర్యంలో టెస్టును నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏపీ డీఎస్సీ సిలబస్‌కు అనుగుణంగా ఆన్‌లైన్‌లో దీన్ని నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్‌నెట్ సదుపాయం కలిగిన మొబైల్ లేదా ట్యాబ్‌లను తెచ్చుకోవాలని సూచించారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. వివరాల కోసం 98483 82193, 80089 13502 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



